సాక్షి విజయనగరం

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



జై.. జవాన్..!

పుల్వామా దాడి ఘటనలో వీరమరణం పొందిన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు నివాళులర్పించారు. వారి సేవలను గుర్తుచేసుకున్నారు. - 8లో



కరాటే పోటీల్లో జిల్లాకు పతకాలు

అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన ఏడుగురు విద్యార్థులు కుమిటీ, కాటా విభాగాలలో పతకాల పంట పండించారు. - 8లో



ఆ పరీక్షలకు విలువేదీ?

ఇంటర్‌మీడియట్ విద్యలో నేటి ఆధునిక సమాజంలో 'నైతికత–మానవ విలువలు', 'పర్యావరణ విద్య'ను పాఠ్యాంశంగా చేర్చారు. పరీక్ష 15, 17 తేదీల్లో జరగనున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

మల్లన్నతలపాగా ఊరేగింపు



పెనుబాకలో మల్లన్న తలపాగాను ఊరేగింపు చేస్తున్న భక్తులు

రాజాం/రాజాం సిటీ: శ్రీశైలం మల్లికార్జునస్వామికి శివరాత్రి రోజున ధరించనున్న తలపాగను పెనుబాక, రాజాం పట్టణంలోని పలు వీధుల్లో భక్తులు మంగళవారం ఊరేగింపుచేశారు. పెనుబాక గ్రామానికి చెందిన వట్టి పుష్పవతి ఆధ్వర్యంలో చేనేత కార్మికులు 162 మీటర్ల తలపాగాను మగ్గంపై నేశారు. అలాగే, జినగం నరసింహులు ఆధ్వర్యంలో మరోతల పాగాను తయారుచేసి ఊరేగించారు. ఈ క్రతువులో పెనుబాక, రాజాం పట్టణానికి చెందిన పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

నేడు కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పోస్టుల భర్తీలో భాగంగా మార్చురీ అటెండెంట్ పోస్టుకు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు వచ్చే అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

కళ్లద్దాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన కళ్లద్దాల సరఫరాకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైస్‌చైర్మన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ బి.శివప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,100 మందికి కళ్లద్దాలు సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. అద్దాలు, ఫ్రేమ్, జీఎస్‌టీ కలిపి ఒక్కోదానికి రూ.280 ధర మించకుండా షీల్డ్ కవర్ ద్వారా ఈనెల 20వ తేదీ సాయంత్రం 4 గంటలలోగా రూ.5 వేల ధరావత్తుతో టెండర్ దాఖలు చేయాలని పేర్కొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి



ర్యాలీను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద 'సైకిల్ ఫర్ హెల్త్' ర్యాలీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎక్కువ మంది బైక్‌లు, కార్లపై ప్రయాణం చేయడం వల్ల ఊబకాయం, గుండె జబ్బులు, బీపీ, సుగర్ వంటి వ్యాధుల బారినపడుతున్నారన్నారు. సైక్లింగ్‌తో శరీరంలో కొవ్వు తగ్గి ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. నడవడం, పరిగెత్తడం, ఆటలు ఆడడం వంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, 104 విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల మేనేజర్లు వినోద్, వెంకట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ ప్రిలిమినరీ రాతపరీక్షకు పటిష్ట భద్రత

- విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ



భద్రతా ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ

విజయనగరం క్రైమ్: ఎస్‌ఐ ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఈనెల 19న నిర్వహించే ప్రిలిమినరీ రాత పరీక్ష కేంద్రాలను మంగళవారం రాత్రి విశాఖరేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద భద్రతను పర్యవేక్షించారు. సీతం, జేఎన్‌టీయూ, ఎం.ఆర్.కళాశాల, శ్రీ చైతన్య, భాష్యం, ఏజీఎల్ , లెండి, ఎంవీజీఆర్ కళాశాలలను డీఐజీ సందర్శించారు. పేపర్లను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి, సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. కళాశాల యాజమాన్యాలు చేపట్టిన చర్యలను డీఐజీకి కళాశాలల అధికారులు, ప్రిన్సిపాల్స్ వివరించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, సీఐలు జి.రాంబాబు, బి.వెంకటరావు, లక్ష్మణరావు, టి.వి.తిరుపతిరావు, ఎస్‌ఐ గణేష్ పాల్గొన్నారు.

బొప్పాయి సాగుకు రాయితీలు భళా..!

- హెక్టార్ విస్తీర్ణంలో సాగుకు సబ్సిడీ రూపంలో రూ.18వేలు సాయం
- 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు
- ఎకరానికి రూ.70వేలు ఖర్చు చేస్తే రూ.3లక్షల వరకు ఆదాయం
- బొప్పాయి కాయల టన్ను ధర రూ.8వేలు, పండ్లు టన్ను ధర రూ.15వేలు
- ఏడాది పొడవునా ఆదాయం
- జిల్లాలో ఆరు వందల ఎకరాల్లో సాగవుతున్న బొప్పాయి



చీపురుపల్లిలో మొక్కదశలో ఉన్న బొప్పాయి పంట



కోత దశలో ఉన్న బొప్పాయి పంట

చీపురుపల్లి రూరల్:

ప్రకృతి కరుణిస్తే బొప్పాయి తోటలు రైతులకు కాసులు కురిపిస్తాయి. ఏడాది పొడవునా ఆదాయం చేతికి అందుతుంది. రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తుంది. ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిస్తే నష్టం కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఈ పరిస్థితుల నుంచి రైతన్నను గట్టెక్కించేందుకు, రైతుకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోంది. రాయితీల జల్లు కురిపిస్తోంది. అధిక ఆదాయాన్నిచ్చే బొప్పాయి సాగును ప్రోత్సహిస్తోంది.

రూ.18వేలు సబ్సిడీ..

రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య పంట అయిన బొప్పాయి సాగుపై రైతుల్లో ఆసక్తిని కల్పించి సాగువిస్తీర్ణం పెంచేందుకు రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం పేరుతో సబ్సిడీ అందిస్తోంది. హెక్టారు విస్తీర్ణంలో పంట సాగుకు రూ.18వేలు పెట్టుబడి సాయం చేస్తోంది. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను 90 శాతం రాయితీపై సమకూర్చుతోంది. హెక్టారుకు సరిపడే 12 మిల్లీమీటర్ల పొడవు గల డ్రిప్ యూనిట్ పూర్తి ధర రూ.72,848 కాగా రూ.7,284కు, 16 మిల్లీమీటర్ల పొడవు గల డ్రిప్ యూనిట్ పూర్తి ధర రూ.88,749 రూపాయలు కాగా 8,874కు అందిస్తోంది.

రాయితీలు అందుకోవడం ఇలా..

బొప్పాయి పంటను సాగుచేసే రైతులు స్థానికంగా ఉన్న రైతుభరోసా కేంద్రాల్లోని వ్యవసాయ విజ్ఞాన సహాయకులను సంప్రదించాలి. మొక్కల బిల్లుతో పాటు ఆధార్‌కార్డు జిరాక్సు, సాగు చేసిన పంట విస్తీర్ణం ఫొటో వివరాలు, బ్యాంకు అకౌంట్ వివరాలను అందజేస్తే రూ.18వేలు ప్రోత్సాహకాన్ని ఖాతాలో జమచేస్తారు. డ్రిప్ పరికరాలకు ఆర్‌బీకేలో దరఖాస్తు చేసుకోవాలి.

18 నెలల పంట కాలం..

బొప్పాయి పంట కాలం 18 నెలలు. 6 నెలలు నుంచి పంట చేతికి వస్తుంది. బొప్పాయి విత్తనం నాటిన నుంచి 5 నెలల వరకు మొక్కలను సంరక్షిస్తే 6వ నెల నుంచి పంట కోతకు వస్తుంది. 18 నెలల వరకు ఏడాది కాలం పాటు ప్రతీవారం పది రోజులకు ఒకసారి పంటకోసి ఆదాయం పొందవచ్చు. ఎకరా విస్తీర్ణంలో బొప్పాయి సాగుకు రూ.70వేలు వరకు ఖర్చు కాగా సుమారు 3లక్షల వరకు ఆదాయం వస్తుందని ఉద్యానవనశాఖాధికారులు చెబుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో పంటను సాగు చేస్తే సుమారు 25 టన్నుల వరుకు దిగుబడి వస్తుంది. బొప్పాయి కాయలు టన్ను రూ.8వేలు, పండ్లు టన్ను రూ.15వేలు పైబడి ధర పలుకుతోంది. బొప్పాయికి మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో జిల్లాలో 6 వందల ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నారు. కొందరు రైతులు భీమవరం, కోల్‌కతా వంటి దూర ప్రాంతాలకు ఎగుమతి చేసి లాభాలు పొందుతున్నారు.

బొప్పాయి సాగుకు ప్రోత్సాహం

ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం పేరుతో బొప్పాయి పంటను సాగు చేస్తున్న రైతుకు హెక్టారుకు రూ.18వేలు పెట్టుబడి సాయం చేస్తోంది. 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను సమకూర్చుతోంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– చంద్రశేఖర్, ఉద్యానవనశాఖాధికారి

పోలమాంబ కటాక్షం కోసం..

- దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- మొక్కుబడుల చెల్లింపు
- వైభవంగా నాలుగో జాతర
- అమ్మవారి సేవలో డిప్యూటీ సీఎం సతీమణి రోజమ్మ



పూజలందుకుంటున్న పోలమాంబ అమ్మవారు



పోలమాంబ సేవలో డిప్యూటీ సీఎం సతీమణి రోజమ్మ



మొక్కులు చెల్లిస్తున్న మహిళా భక్తులు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి నాలగవ జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అధికారుల అంచనాలకు మించి భక్తులు తరలివచ్చారు. గోముఖినదిలో పుణ్యస్నానాలాచరించి అమ్మవారిని దర్శించారు. మొక్కుబడులు చెల్లించారు. ఉదయం 9 గంటల నుంచి భక్తుల తాకిడి పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లు రద్దీగా మారాయి. చదురుగుడిలో పోలమాంబ అమ్మవారిని, వనంగుడిలోని పెద పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి వేపచెట్టుకు పూజలు చేశారు. గోముఖి నది తీరంలోని తోటల్లో వంటలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సాలూరు సీఐ ధనంజయరావు, మక్కువ ఎస్‌ఐ జి.పైడిరాజు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించారు. జాతరలో సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారాకాశాయి.

అమ్మవారి సేవలో...

శంబర పోలమాంబ అమ్మవారిని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర సతీమణి రోజమ్మ దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ పూడి దాలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ రోజమ్మకు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించి, తీర్థప్రసాదాలను అందజేశారు.



భక్తులతో నిండిన క్యూకాంప్లెక్స్

తల్లిదండ్రుల ఆశీస్సులే కొండంత అండ

- రోటరీ పురస్కారం అందుకున్న సినీ నటుడు సాయికుమార్
- రోటరీ బిజినెస్ పురస్కార్ అందుకున్న విజయ భార్గవ్



సినీనటుడు సాయికుమార్‌కు రోటరీ పురస్కారంను అందజేస్తున్న రోటరీ సెంట్రల్ విజయనగరం ప్రతినిధులు

విజయనగరం టౌన్: జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆశీస్సులే నాకు కొండంత అండగా నిలిచాయని రొటేరియన్, సినీనటుడు పూడిపెద్ది సాయికుమార్ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో ఉల్లివీధిలో ఉన్న చాంబర్ ఆఫ్ కామర్స్ వాణిజ్య భవన్ ఆవరణలో వొకేషనల్ మంత్ వేలడిక్టరీ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సెషన్స్ జడ్జి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, గౌరవ అతిథిగా రోటరీ పూర్వ గవర్నర్ మాదిపల్లి రామారావు, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ పి.సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా 2023 సంవత్సరానికిగానూ రోటరీ పురస్కార్‌ను సినీ నటుడు పూడిపెద్ది సాయికుమార్‌కు అందజేశారు. రోటరీ బిజినెస్ పురస్కార్‌ను ఇంటీరియర్ డిజైనర్, ఆర్కిటెక్ట్ విజయభార్గవ్‌కు అతిథుల చేతుల మీదుగా అందజేశారు.

ఈ సందర్భంగా రోటరీ పురస్కార్ గ్రహీత, సినీనటుడు సాయికుమార్ మాట్లాడుతూ తన నట ప్రస్థానం 50 ఏళ్లుగా సాగుతోందన్నారు. విజయనగరం పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నాను.. కోటను చూడగానే నేను 1974లో చేసిన దుర్యోధన మహిసభ గుర్తుకు వచ్చిందన్నారు. విజయనగరం రాగానే ఎన్నో జ్ఞాపకాలతో పాటు నాన్న లేరనే వెలితి ఉందని, ఆయనుంటే ఎంతో సంతోషించే వారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ కృష్ణగోపాల్ అగర్వాల్, వొకేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ పి.జయకృష్ణ, చైర్మన్ అశోక్, కార్యదర్శి మనోజ్, కౌన్సిలర్ కాపుగంటి శ్రీనివాస్, క్లబ్ సర్వీస్ డైరెక్టర్ ఆర్.శంకర్ రెడ్డి, రొటేరియన్‌లు పాల్గొన్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన జపాన్ బృందం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీను జపాన్‌కు చెందిన సాంకేతిక నిపుణులు కెనిచి ఇషికవా, యోషియాకి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జపాన్‌లో యువత కంటే వృద్ధుల జనాభా శాతం ఎక్కువగా ఉందని, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని భారత్‌లో వృద్ధులకు అమలుచేస్తున్న పథకాల కోసం భారతీయ బ్యాంకింగ్ రంగాన్ని సందర్శించామన్నారు. భారత్‌లో వృద్ధులకు బాసటగా నిలిచే పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ జపాన్ ఎల్రక్టానిక్స్ పరికరాల తయారీలో అద్భుత ప్రగతిని సాధించిందన్నారు. అనంతరం విద్యార్థులకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. వీసీ జీఎస్ఎన్ రాజు జపాన్ బృంద సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పీఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ పాల్గొన్నారు.



జపాన్ సాంకేతిక నిపుణులను సత్కరిస్తున్న వీసీ జీఎస్ఎన్ రాజు, తదితరులు

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు ఫీజు చెల్లించాలి

విజయనగరం పూల్‌బాగ్: జిల్లాలో ఏప్రిల్‌లో జరగనున్న టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు లోయర్, హయ్యర్ గ్రేడ్ (డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, హ్యాండ్లూమ్ వేవింగ్) పరీక్షలకు సంబంధించిన ఫీజును సీఎఫ్ఎంఎస్ చలానా ద్వారా చెల్లించి టీటీటీ. ఘ్ర్ఝ ఇజౌలి.జీ ౖ లో ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధరుసుము లేకుండా ఈనెల 25లోగా, రూ.50 అపరాధరుసుముతో మార్చి3 లోగా, రూ.75 అపరాధరుసుముతో మార్చి 10వ తేదీ లోగా ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు www.bre.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

- కలెక్టర్ సూర్యకుమారి



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

చీపురుపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా తర్ఫీదునివ్వాలని డీఈఓ రామలింగేశ్వరరెడ్డికి కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. సూపర్ 60 బ్యాచ్ విద్యార్థులతో మాట్లాడారు. ఇంతవరకు జరిగిన పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను పరిశీలించారు. మార్చిలో జరగనున్న పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారంటూ ప్రశ్నించారు. విద్యార్థుల జీవిత లక్ష్యాలను తెలుసుకున్నారు. ఇష్టపడి చదివితే ఏదీ కష్టంగా ఉండదని, ప్రతీ సబ్జెక్టులో శతశాతం మార్కులు సాధించేలా చదువు సాగించాలని బోధించారు. బైజూస్ యాప్ వినియోగంపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించాలని డీఈఓకు సూచించారు. యాప్ వినియోగాన్ని విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులకు పాఠశాలలోనే కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎంకు సూచించారు. అనంతరం బాలికలతో మాట్లాడుతూ సఖి బృందాలు నిర్వహిస్తున్న సమావేశాలకు హాజరవుతున్నారా లేదా అని ప్రశ్నించారు. పాఠశాలల్లో, వసతిగృహాల్లో జరిగే సఖి బృందాల సమావేశాలకు తప్పకుండా బాలికలు హాజరు కావాలని సూచించారు. ఆమె వెంట హెచ్‌ఎం శ్యామలసాయి ఉన్నారు.

అయ్యప్ప ఆలయ అష్టాదశ వార్షికోత్సవం





కలశ పూజ, (ఇన్‌సెట్లో) సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు

బొబ్బిలి: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో మంగళవారం అష్టాదశ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వేమకోటి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో కలశాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, 41 మండలసహిత హోమ గుండాలతో లక్ష్మీగణపతి, నవగ్రహ, సుబ్రహ్మణ్యేశ్వర, అయ్యప్పస్వామికి సామూహిక హోమాలు జరిపారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దివ్యకల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి పాలూరి శంకరరావు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శాసన మండలి ఎన్నికలకు నోడల్ అధికారులు వీరే..

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లాలో నోడల్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 13న ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఆయా ఏర్పాట్లను నోడల్ అధికారులు పర్యవేక్షిస్తారని ఆమె పేర్కొన్నారు.

విభాగం/ప్రక్రియ	అధికారి పేరు	సెల్ నంబర్
మేన్‌పవర్ మేనేజ్‌మెంట్	పి.బాలాజీ, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి	98499 01472
ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్	వి.సుందర్ (ఆర్టీఓ), కె.శ్రీనివాసరావు (డీపీటీఓ)	91542 94102 99592 25604
ట్రైనింగ్ మేనేజ్‌మెంట్	కె.పద్మలత(ఎస్‌డీసీ), ఎం.అరుణకుమారి(తహసీల్దార్)	90634 14109 83338 13260
మెటీరియల్ మేనేజ్‌మెంట్	జి.సుధాకరరావు, పీడీ, మెప్మా	83097 80269
మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్	ఆర్.వి.సూర్యనారాయణ, ఎస్‌డీసీ (కేఆర్ఆర్‌సీ)	90009 81228
పరిశీలకులు	జి.ఉమాశంకర్ (ఎస్ఈ, ఆర్‌డబ్ల్యూఎస్), జి.ఉమాపరమేశ్వరి(పీడీ, డ్వామా)	91001 20700 91540 84948
శాంతిభద్రతలు	అడిషనల్ ఎస్పీ(అడ్మిన్), ఎం.అశోక్‌కుమార్ (జెడ్పీ సీఈఓ)	94910 35889
బ్యాలెట్ పేపర్స్	డి.వెంకటేశ్వరరావ(ఎస్‌డీసీ, బొబ్బిలి)	99517 69805
మీడియా, కమ్యూనికేషన్	డి.రమేష్, డీపీఆర్వో	91212 15261
హెల్ప్‌లైన్– కంప్లైంట్స్	ఎ.కల్యాణచక్రవర్తి (పీడీ, డీఆర్‌డీఏ)	88972 11135
ఫుడ్– స్నాక్స్ మేనేజ్‌మెంట్	కె.మీనాకుమారి (డీఎం, సివిల్ సప్లయిస్)	99634 79142
లైవ్ వెబ్‌కాస్టింగ్	జి.సుదర్శనదొర (ఎస్‌డీసీ, పార్వతీపురం)	94943 26124
బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్	పి.శ్రావణ్, జి.అశోక్, జి.పోలినాయుడు, బాలకృష్ణ	99851 55143, 90305 46667 95733 11084, 83093 33960
టెక్నికల్ టీమ్	పి.శ్రావణ్, రియాజ్ ఖాన్	99851 55143 93947 43069
ఆపరేటింగ్ వెబ్‌కాస్టింగ్	జి.అశోక్, పి.శ్రావణ్, రియాజ్ ఖాన్	90305 46667, 99851 55143 9394 743069
మీడియా కవరేజ్	ఆర్.నరేంద్ర, డీఐఓ, ఎన్ఐసీ, వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్	94409 19971
రిజర్వ్ అధికారులు:	జి.పద్మావతి, డీపీఎం	91001 24602
	ఏవీఎస్‌వీ జమదగ్ని, జిల్లా ఉద్యాన అధికారి	79950 86762
	పి.లక్ష్మీనారాయణ, పీడీ, ఏపీఎంఐపీ	79950 87037

క్లుప్తంగా

సెపక్‌తక్రా జిల్లా జట్ల ఎంపిక రేపు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్‌ సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొన బోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 16న నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ కార్యదర్శి ఎల్‌వీ రమణ మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి నగరంలోని వీటీ అగ్రహారం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఎంపిక పోటీల్లో అండర్‌–14,17 విభాగాల్లో బాల బాలికలు పాల్గొనేందుకు అర్హులుగా పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో జరిగే ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు ఫోన్‌ 9441306097 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

23 నుంచి అండర్‌–14 క్రికెట్‌ పోటీలు

రాష్ట్రస్థాయిలో జరగబోయే అండర్‌–14 బాలుర క్రికెట్‌ పోటీల నిర్వహణ తేదీల్లో మార్పులు జరిగినట్లు జిల్లా స్కూల్‌గేమ్స్‌ ఫెడరేషన్‌ కార్యదర్శి ఎల్‌వీ రమణ తెలిపారు. తాజా సమాచారం మేరకు ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు అంతర్‌ జిల్లాల పోటీలు జరుగుతాయని, ఇప్పటికే నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపికల్లో అర్హత సాధించిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధం కావాలని సూచించారు. అలాగే ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు విశాఖలో అండర్‌–11,14,17,19 కేటగిరీల్లో రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌ పోటీలు నిర్వహించేందుకు రాష్ట్ర అసోసియేషన్‌ నిర్ణయించినట్లు వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విశాఖపట్నానికి చెందిన బమ్మిడి సత్తిరాజు(32) తగరపువలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. మృతుని బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాపట్నానికి చెందిన బమ్మిడి సత్తిరాజు అసరవిల్లి సూర్యనారాయణమూర్తిని దర్శించుకునేందుకు తన భార్య, ఇద్దరు పిల్లలను తీసుకుని ద్విచక్రవాహనంపై సోమవారం ఉదయం బయల్దేరాడు. మార్గమధ్యంలో లింగాలవలస చేరుకునేసరికి కుక్క అడ్డం రావడంతో అదుపుతప్పి బైక్‌ డివైడర్‌ను ఢీకొట్టడంతో కుటుంబసభ్యులంతా తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో తగరపువలస ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సత్తిరాజు మృతిచెందాడు. మృతుని తమ్ముడు సింహాద్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

కాలిపోయిన వృద్ధురాలు..

వీరఘట్టం: మండలంలోని కంబర గ్రామంలో ఈనెల 12న తన ఇంటిలో జరిగిన అగ్ని ప్రమాదంలో శరీరం మొత్తం పూర్తిగా కాలిపోయిన వృద్ధురాలు సఖినాన చిన్నమ్మడు (70) పార్వతీపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై ఎం.హరికృష్ణ మంగళవారం తెలిపారు. ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్‌ పొయ్యిపై నుంచి వచ్చి మంట చీర అంచును తాకడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఆమె భర్త స్వామినాయుడు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి,పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని ఎస్సై చెప్పారు.

చెరువులో పడి మరొకరు..

విజయనగరం క్రైమ్‌: స్థానిక అయ్యన్నపేట గ్రామం బీసీ కాలనీకి చెందిన వంగర మహంకాళి (38) చెరువులో పడి మంగళవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. కార్పెంటర్‌ పనులకు వెళ్తూ, మద్యానికి బానిసైన మహంకాళిని మద్యం తాగవద్దని భార్య అంజలి వారిస్తుండడంతో ఇద్దరి మధ్య నిత్యం తగాదాలయ్యేవి. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో టిఫిన్‌ కోసం వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహంకాళి తిరిగి ఇంటికి చేరలేదు. మంగళవారం అయ్యన్నపేట శివారు ప్రాంతంలో ఉన్న అయ్యన్నకోనేరులో చనిపోయి తేలాడు. మద్యం మత్తులో స్నానానికి కోనేరులో దిగి ప్రమాదవశాత్తు మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. ఫిర్యాదు మేరకు ఎస్సై భాస్కర్‌ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్‌ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్‌

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్‌

బ్రాయిలర్‌

లైవ్‌	డ్రెస్డ్‌	స్కిన్‌లెస్‌
₹92	₹154	₹ 164

జై.. జవాన్‌..!

- సీఆర్‌పీఎఫ్‌ జవాన్‌లకు ఘనంగా నివాళి



వాట్‌ ఆధ్వర్యంలో జవాన్‌లకు నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం: పుల్వామా దాడి ఘటనలో వీరమరణం పొందిన సీఆర్‌పీఎఫ్‌ జవాన్‌లకు వాట్‌ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు నగరంలోని పోలీస్‌ బ్యారెక్స్‌ ఆవరణలో గల సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ విగ్రహం వద్ద వీరజవాన్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు నేటిపల్లి పృథ్వీ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన జవాన్‌లను నేటి తరంతో పాటు భవిష్యత్‌ తరాల వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. దేశ సేవలో యువత ముందంజలో ఉండాలని, చిన్నతనం నుంచి దేశభక్తి పాఠాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మద్దిల సోంబాబు, కుమారస్వామి, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

పుల్వామా దాడిలో వీర మరణం పొందిన సీఆర్పీఎఫ్‌ జవాన్లకు ఆత్మశాంతి కలగాలని 1వ పట్టణ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరావు పేర్కొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌ ఆధ్వర్యంలో చైతన్య జూనియర్‌ కళాశాలలో నిర్వహించిన బ్లాక్‌ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 14వ తేదీ రాగానే అందరికీ వీర జవాన్ల మరణాలు గుర్తుకు రావాలని, ప్రేమికుల రోజు కాదన్నారు. ప్రతి వ్యక్తి భారతదేశ చరిత్రను తెలుసుకోవాలని దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కేశవరావు, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

అమర జవాన్లకు నివాళి

చీపురుపల్లి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరులు భారత సైనికులను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటూ వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఆశయ యూత్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందిన 40 మంది సీఆర్‌పీఎఫ్‌ జవాన్లకు మంగళవారం స్థానిక జీవీఆర్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలు పట్టుకుని వీరమరణం పొందిన జవాన్లకు సెల్యూట్‌ చేశారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారి జీవితాలను దేశం కోసం త్యాగం చేశారని చెప్పారు. అలాంటి వారిని ప్రస్తుత యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. వారి త్యాగాన్ని నిరంతరం స్మరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వై.లక్ష్మణరావు, చిలకయ్య, నవీన్‌, సాయి, యువత పాల్గొన్నారు.



అమరవీరులకు సెల్యూట్‌ చేస్తున్న యువత

కరాటే పోటీల్లో జిల్లాకు పతకాలు



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయనగరం: పట్టణానికి చెందిన పలువురు విద్యార్థులు అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్‌లో పతకాలు సాధించారు. ఈ మేరకు కరాటే కోచ్‌ కానూరు సంతోష్‌ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పట్టణానికి చెందిన ఏడుగురు విద్యార్థులకు కుమిటీ, కాటా విభాగాలలో ఈ పతకాలు లభించినట్లు తెలిపారు. విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్‌ స్టేడియంలో ఈనెల 9 నుంచి 13వ తేదీ వరకు నిజీ స్పోర్ట్స్‌ కరాటే అసోసియేషన్‌ ఆఫ్‌ ఇండియా, నాయుడు సెల్ఫ్‌ డిఫెన్స్‌ అకాడమీ నిర్వహించిన సీఎం కప్‌–2023 అంతర్జాతీయ కరాటే పోటీలలో ఈ పతకాలు సాధించారని చెప్పారు. కుమిటీ విభాగంలో విద్యార్థులు బి.శివ శ్రీ హర్ష సిల్వర్‌ పతకం, ఎస్‌.రుషికేశవకృష్ణ కాంస్య పతకం, పి.హేమంత్‌ కాంస్య పతకం, ఆర్‌.రుద్ర అగస్త్య కాంస్య పతకం సాధించారు. కాటా విభాగంలో బి.షణ్ముఖ శ్రీకర్‌ కాంస్య పతకం, ఎస్‌.చరణ్‌ కార్తికేయ కాంస్య పతకం, ఎస్‌.జితేంద్ర కాంస్య పతకం సాధించారు. అంతర్జాతీయ కరాటే పోటీలలో విజయనగరం చిన్నారులు పతకాలను సాధించడం పట్ల అసోసియేషన్‌ అధ్యక్షుడు కె.సుమన్‌, విద్యార్థుల తల్లిదండ్రులు పట్టణంలోని పలు విద్యా, క్రీడా సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

జూడో పోటీల్లో జిల్లా విద్యార్థులకు పతకాల పంట



ముత్యాల వినీతకు బంగారు పతకం, సర్టిఫికెట్‌ అందజేస్తున్న ఉమేష్‌ కుమార్‌

రామభద్రపురం: విజయవాడలోని మాంటిస్సోరి ఇండోర్‌ హాల్‌లో ఈ నెల 11,12 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో జిల్లా విద్యార్థులు పతకాల పండించినట్లు జూడో అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి బొత్స రత్నకిశోర్‌ తెలిపారు. రాష్ట్రస్థాయి సబ్‌ జూనియర్‌, క్యాడెట్‌ జూడో పోటీల్లో జిల్లా బాలుర జట్టు రెండు బంగారు పతకాలు, 4 రజత పతకాలు, 8 కాంస్య పతకాలు సాధించినట్లు చెప్పారు. అందులో కొట్టక్కి ఉన్నత పాఠశాలకు చెందిన ముత్యాల వినీత, మేడపల్లి మోడల్‌ పాఠశాలకు చెందిన కె.శ్రావణిలు బంగారు పతకాలు సాధించగా సామిరెడ్డి రామలక్ష్మి(జెడ్పీహెచ్‌ఎస్‌, కొట్టక్కి), తూముల యశోద (ఏపీఎంఎస్‌ మేడపల్లి),గేదెల లక్ష్మణరావు (ఉన్నత పాఠశాల, ఆరికతోట), రజత పతకాలు సాధించారని తెలిపారు. అప్పికొండ శరత్‌ నాయుడు, మరిసి లావణ్య(ఉన్నత పాఠశాల కొట్టక్కి), వంశీకృష్ణ(ఏఎస్‌డబ్ల్యూపాఠశాల,పీఎస్‌ బొడ్డవలస), ఆరంగి యశస్విని, సీహెచ్‌ షర్మిల (కేజీబీవీ రామభద్రపురం), కారంగి విమల (ఉన్నత పాఠశాల కొట్టక్కి), టి వరలక్ష్మి (కేజీబీవీ బాడంగి) ఎ.ప్రేమ్‌కుమార్‌ (ఉన్నత పాఠశాల ఆరికతోట) కాంస్య పతకాలు సాధించారని వివరించారు. పతకాల సంఖ్యను బట్టి ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌లో జిల్లా రెండవ స్థానం సాధించినట్లు చెప్పారు. వారంతా జాతీయస్థాయి జూడో పోటీలకు ఎంపికరయ్యారని, చైన్నైలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను జూడో ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా పరిశీలకుడు ఉమేష్‌కుమార్‌తో పాటు జిల్లా జూడో అసోసియేషన్‌ అధ్యక్షుడు మరిశర్ల రామారావు, చైర్మన్‌ ఆర్‌ వాసుదేవరావు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నల్ల వెంకటనాయుడు, కె.సన్యాసినాయుడు తదితరులు అభినందించారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన ప్రజాప్రతినిధులు



టీటీడీ బోర్డు చైర్మన్‌ వైవీ సుబ్బారెడ్డితో జిల్లా ప్రజాప్రతినిధులు

విజయనగరం: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్‌ కో ఆర్డినేటర్‌ వైవీ సుబ్బారెడ్డిని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు విజయవాడలోని ఆయన నివాసంలో మర్యాపూర్వకంగా మంగళవారం కలిశారు. టీటీడీ చైర్మన్‌ను కలిసిన వారిలో డిప్యూటీ స్పీకర్‌ కోలగట్ల వీరభద్ర స్వామి, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె. కిరణ్‌కుమార్‌, ఎమ్మెల్సీలు డాక్టర్‌ సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు ఉన్నారు. ఈ సందర్భంగా వారంతా ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, గృహ సారథుల నియామకం పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు కనకదుర్గమ్మ తల్లిని దర్శించుకున్న వారు అనంతరం ఎమ్మెల్సీ తలశిల రఘురాంను పరామర్శించి ఆయన భార్య మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రఘురాం కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌ కార్యదర్శి ఎంఎల్‌ఎన్‌రాజు, పైడితల్లమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యుడు ఎంకేబీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: చదవాలన్న ఇష్టం లేని ఓ ఇంటర్మీడియట్‌ విద్యార్థిని పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలం మసిమండ గ్రామానికి చెందిన టి.అరుణ కొమరాడలోని కేజీబీవీ కళాశాలలో ఇంటర్‌మీడియట్‌ చదువుతోంది. ఆమెకు చదవాలని లేకపోవడం, జ్ఞా పకశక్తి తక్కువగా ఉండడం తదితర కారణాలవల్ల చదువుపై ఆసక్తిలేకపోయినప్పటికీ తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల బలవంతంతో చదువుతోంది. తనకు చదువు ఇష్టం లేదని పదేపదే చెప్పినా కుటుంబసభ్యులు వినిపించుకోకపోవడంతో విరక్తి చెంది పురుగుమందు తాగేసింది. కుటుంబసభ్యు లు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్‌: పశ్చిమబెంగాల్‌లోని మిడ్నాపూర్‌ వెస్ట్‌, రాణిచౌక్‌ గ్రామానికి చెందిన పుణ్యబ్రత సమంత (20) అనే యువకుడు మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్‌ సీఐ బి.వెంకటరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. బంగారు పనుల నిమిత్తం కొన్నేళ్లుగా విజయనగరంలో పరపతివీధిలో తోటి మిత్రులతో కలిసి పణ్యబ్రత ఉంటున్నాడు. కొద్ది రోజులుగా ముభావంగా ఉన్నాడు. సోమవారం అర్ధరాత్రి 2 గంటల వరకూ అందరూ కలిసి పనిచేసి పడుకున్నారు. అయితే మంగళవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఇంటి యజమానురాలు మేడపైకి వెళ్లి చూసేసరికి పెంట్‌హౌస్‌లో రేకులషెడ్‌ ఇనుపగొట్టానికి తువ్వాలుతో ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. కొంతకాలంగా తన బిడ్డ ప్రేమికురాలితో ఫోన్‌లో మాట్లాడడం, వారిద్దరి మధ్య వివాదం జరుగుతున్నట్లు మృతుని తల్లి సజల సమంత తెలిపారు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు.

ఆ పరీక్షలకు విలువేదీ?

- మొక్కుబడిగా నిర్వహణ
- చూసిరాతలతోనే ఉత్తీర్ణత
- నేడు నైతిక విలువలు, 17న పర్యావరణ విద్యపై పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా హాజరు కానున్న 32,732 మంది విద్యార్థులు

రాజాం సిటీ: నేటి ఆధునిక సమాజంలో 'నైతికత–మానవ విలువలు', 'పర్యావరణ విద్య' ప్రాధాన్యత అంశాలుగా గుర్తించి ఇంటర్‌మీడియట్‌ విద్యలో పాఠ్యాంశాలుగా చేర్చారు. ఏటా ఈ అంశాలపై నిర్వహిస్తున్న పరీక్షలు మొక్కుబడిగానే సాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలా కళాశాలల్లో ఈ అంశాలపై బోధన కూడా జరగడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాతోపాటు రాజాం, పాలకొండ నియోజకవర్గాల్లోని మొత్తం 276 జూనియర్‌ కళాశాలల్లో 32,732 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఈ పరీక్షలకు ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో యాథాలాపంగానే జరుగుతున్నాయి.

నైతిక విలువలు పెంపొందించేందుకు..

పెరిగిపోతున్న పాశ్చాత్య పెడధోరణులను నియంత్రించే క్రమంలో భాగంగా విద్యార్థి లోకానికి నైతిక విలువల ఆవశ్యకతను పెంపొందించేందుకు ఇంటర్‌మీడియట్‌ ఫస్టియర్‌ విద్యార్థులకు 'నైతికత–మానవ విలువలు', పర్యావరణం అనే పాఠ్యాంశాన్ని రాష్ట్ర మానవవనరుల శాఖ 2015 నుంచి ప్రవేశపెట్టింది. ఈ నెల 15న నైతికత–మానవ విలువలు, 17న పర్యావరణ విద్యపై పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఉత్తీర్ణులై తీరాలి

ఇంటర్‌మీడియట్‌ ఫస్టియర్‌లో నిర్వహించే ఈ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణులు కాకుంటే ఇంటర్‌మీడియట్‌ తప్పినట్లుగా పరిగణిస్తారు. అయితే మార్కులను పరిగణలోకి తీసుకోరు. ఇంటర్‌మీడియట్‌ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో గ్రూప్‌ సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులైనా 'నైతికత–మానవ విలువలు', 'పర్యావరణ విద్య' సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులు కాకపోతే మార్కుల జాబితాను అందజేయరు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 33 ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు,127 ప్రైవేట్‌ కళాశాలలు, 13 సోషల్‌ వెల్ఫేర్‌ కళాశాలలు, 9 ట్రైబల్‌ వెల్ఫేర్‌ కళాశాలలు, 40 కేజీబీవీ కళాశాలలు, 17 మోడల్‌ కళాశాలలు, 1 ఏపీఆర్‌జేసీ, 1 మహాత్మా జ్యోతిరావుపూలే కళాశాల, 25 ప్రైవేట్‌ ఒకేషనల్‌ కళాశాలలో మొత్తం 32, 732 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.

పాఠ్య ప్రణాళికలో దక్కని చోటు

ఇంటర్‌మీడియట్‌లో పర్యావరణ విద్య, నైతికత–మానవ విలువలను పాఠ్యాంశంగా 2015 నుంచి అమలు చేస్తున్నారు. అయితే ఈ అంశాలను పాఠ్య ప్రణాళికలో మాత్రం చేర్చకుండా ఇంటర్‌మీడియట్‌ బోర్డు విస్మరిస్తోంది. ఏటా ఈ అంశాలపై పరీక్షలను ఫస్టియర్‌ విద్యార్థులకు నిర్వహిస్తున్నా పాఠ్య ప్రణాళికలో చోటు కల్పిద్దామన్న ఆలోచన విద్యాశాఖకు ఉండడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చూసి రాతతోనే పరీక్ష

పాస్‌ మార్కు వస్తే చాలని, ఇంటర్‌మీడియట్‌ మార్కులకు వీటిని కలపకపోవడంతో ఈ సబ్జెక్టును కేవలం మొక్కుబడిగానే పరిగణిస్తున్నారు. ఈ పరీక్షలను ఏ కళాశాలలో చదివే విద్యార్థులకు ఆ కళాశాలలోనే నిర్వహిస్తున్నారు. దీని వల్ల చూసిరాతలు కొనసాగుతన్నాయనే విమర్శలు ఉన్నాయి. వీటిని ప్రాధాన్యం లేని పరీక్షలుగా పలు ప్రైవేట్‌, కార్పొరేట్‌ కళాశాలల యాజమాన్యాలు కొట్టిపారేస్తున్నాయి.



పర్యావరణ పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్‌)

పకడ్బందీగా నిర్వహణ

ప్రస్తుతం జరగనున్న నైతికత–మానవ విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు తప్పనిసరిగా పాసై తీరాలి. ఎటువంటి చూసి రాతలకు తావు లేదు. అన్ని కేంద్రాల్లో తనిఖీలు చేస్తాం. ఎటువంటి అవకతవకలు జరగకుండా పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేపట్టాం.
– ఎం.సత్యనారాయణ, ఆర్‌ఐఓ, విజయనగరం

రోడ్డుపై గిరిజనుల బైఠాయింపు

- 'ఆశ్రమ' నిర్లక్ష్యంతో గిరిజన విద్యార్థిని మృతిచెందినట్లు ఆరోపణ



ఆందోళన కారులతో మాట్లాడుతున్న సబ్‌ కలెక్టర్‌ నూరల్‌ కమర్‌, తహసీల్దార్‌ అప్పారావు

భామిని: పూతికవలస గిరిజన ఆశ్రమ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే పదవ తరగతి విద్యార్థిని కొండగొర్రి పవిత్ర(15) మృతి చెందిందని, ఆరోపిస్తూ మండలంలోని ఇసుకగూడ సెంటర్‌లో ఏబీ రోడ్డుపై ఆదివాసీ గిరిజనులు బైఠాయించి మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మూకుమ్మడిగా రాస్తారోకో నిర్వహించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎం కూడా లేదని, సరైన వైద్యపరీక్షలు చేయించలేదని ఆరోపించారు. విద్యార్థి పవిత్ర మృతికి కారణమైన ఆశ్రమ స్కూల్‌ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. మృతురాలు పవిత్ర తల్లిదండ్రులు డోకులగూడకు చెందిన కొండగొర్రి కేధార్‌, మయంతిలతో కలిసి ప్రజాసంఘాలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టి వాహన రాకపోకలను అడ్డుకున్నాయి.

శాంతిపజేసిన సబ్‌ కలెక్టర్‌

అదే రోడ్డులో ప్రయాణిస్తున్న పాలకొండ సబ్‌కలెక్టర్‌ నూరల్‌ కమర్‌ను గిరిజనులు అడ్డుకుని తమకు న్యాయం చేయాలని పట్టుపట్టారు. దీంతో ఆయన ఐటీడీఏ పీఓతో మాట్లాడి తగుచర్యలు తీసుకుంటామని సర్ది చెప్పడంతో ఆందోళన ముగించారు. ఇసుకగూడ, సన్నాయిగూడ, డోకులగూడ, కొత్తగూడ. నల్లరాయిగూడలకు చెందిన ఆదివాసీలు నిరసనలో పాల్గొన్నారు.

ఏనుగులదాడిలో వృద్ధుడి మృతి



మృతిచెందిన దేశీయనాయుడు

బలిజిపేట: మండలంలోని చెల్లెంపేట గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున ఏనుగులు దాడిచేయడంతో అడప దేశీయనాయుడు(70) మృతిచెందాడు. గరుగుబిల్లి పరిసర ప్రాంతాల నుంచి మురగడాం, పి.చాకరాపల్లి మీదుగా ఏనుగుల గుంపు తెల్లవారుజామున చెల్లెంపేట చేరుకున్నాయి. అదే సమయంలో వృద్ధుడు బహిర్భూమికని గ్రామం శివారుకు రావడంతో ఏనుగుల గుంపు ఉన్నట్టు సమీపంలో ఉన్న వారు కేకలు వేశారు. అయితే అంతలోనే గుంపులో ఉన్న ఏనుగు వచ్చి వృద్ధుడిపై దాడి చేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. తన సోదరుడి కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. సోదరుడి పిల్లలే ఆధారం . దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

పార్వతీపురం టౌన్‌: ఏనుగు దాడిలో మృతి చెందిన బలిజిపేట మండలం చెల్లింపేట గ్రామానికి చెందిన అడపా దేశినాయుడు(70) కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో గల జిల్లా ఆస్పత్రి వద్ద మృతుని కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. విజయవాడ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే జోగారావు విషయం తెలుసుకున్న వెంటనే పార్వతీపురం చేరుకుని మార్చురీలో దేశినాయుడు మృతదేహాన్ని సందర్శించి సంఘటనకు సంబంధించిన విషయాలను తెలుసుకుని తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన సహాయం వెంటనే అందే విధంగా చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే జోగారావుతో పాటు ఆ గ్రామ సర్పంచ్‌ రంభ శ్రీనివాసరావు, జేసీఎస్‌ బలిజిపేట మండల కన్వీనర్‌ గంటేడ శ్రీరాములు నాయుడు, మండల నాయకులు, పెద్దలు జరిగిన ఘటనపై తీవ్రవిచారం వ్యక్తం చేస్తూ మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి..

బొబ్బిలి రూరల్‌: మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కింతలి రవి(39) విద్యుత్‌షాక్‌తో సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ సంఘటనపై ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎం.భారతి గ్రామంలో పేపర్‌ప్లేట్లు తయారుచేసే యంత్రం సోమవారం రాత్రి గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తుల సహాయంతో లగేజీ వ్యాన్‌ నుంచి దింపుతుండగా, విద్యుత్‌ షాక్‌ తగిలి ముగ్గురు గాయపడగా, రవి మృతిచెందాడు. మృతదేహాన్ని బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించి, మంగళవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించారు. ఫిర్యాదు మేరకు ఎస్సై చదలవాడ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రవికి భార్య కనకమ్మ, కుమార్తెలు అఖిల, స్రవంతి ఉన్నారు.



రవి మృతదేహం

20రోజులలో పెద్దకుమార్తె వివాహం

ఇదిలా ఉండగా మరో 20రోజులలో మృతుడు రవి పెద్దకుమార్తె వివాహం జరగాల్సి ఉంది. ఈ సమయంలో కుటుంబపెద్ద మృతిచెందడంతో కుటుంబసభ్యులు హృదయ విదారకంగా రోదిస్తున్నారు.

గ్రామస్తుల ఆందోళన

విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన రవి కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం ఉదయం గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో రోడ్డుపై బస్సులు, వాహనాలు నిలిచిపోవడంతో కొద్దిసేపు సమస్య తలెత్తింది. ఈదశలో అటువైపుగా వెళ్తున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు వారిని శాంతింపజేశారు. బాధితకుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. కాగా రవి కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించేలా ఎం.భారతిని గ్రామపెద్దలు బొద్దల సత్యనారాయణ,ఎంపీటీసీ సభ్యుడు రౌతు తిరుపతి రావు ఒప్పించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు